## క్లుప్తంగా

### ట్రాఫిక్ సిగ్నళ్లు సరిచేయించండి

**సత్తుపల్లిరూరల్:** పట్టణంలోని పలుచోట్ల ఉన్న ట్రాఫిక్ సిగ్నళ్లను సరిచేయించాలని ఏసీపీ రామానుజంను పలువురు కోరారు. ఈమేరకు డాక్టర్ మట్టా దయానంద్, ఇమ్మినేని ప్రసాదరావు, దొడ్డా శ్రీనివాసరావు తదితరులు బుధవారం ఏసీపీకి వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని బస్టాండ్ రింగ్ సెంటర్, పాత సెంటర్‌లో ట్రాఫిక్ సిగ్నళ్లు సరిచేయించడమే కాక అవసరమైన చోటకొత్తవి ఏర్పాటు చేయాలని కోరారు.

### కష్టపడితేనే విజయం..

**మధిర:** విద్యార్థులు లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని అహర్నిశలు శ్రమిస్తే విజయం సొంతమవుతుందని ఎస్ఆర్ఐ, మోటివేటర్ వెన్నపూస శ్రీనివాసరెడ్డి తెలిపారు. పట్టణంలోని శీలం పుల్లారెడ్డి మెమోరియల్ డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం జరిగిన గ్లోబల్ అవేర్‌నెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుంటూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కళాశాల డైరెక్టర్ శీలం వెంకటరెడ్డి, ఎస్టీఎఫ్ నాయకులు యరమల కోటారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వాణి వివేకానందలో ఇంగ్లిష్ ఫెయిర్



ఫెయిర్‌లో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు

**వైరా:** స్థానిక వాణీ వివేకానంద పాఠశాలలో హైదరాబాద్‌కు చెందిన సీఎఫ్ఎల్ స్పోకెన్ ఇంగ్లిష్ ఆధ్వర్యాన బుధవారం ఇంగ్లిష్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు అంశాలపై ప్రదర్శనలు ఇవ్వడమే కాక కోడింగ్ దుస్తులు, ఆహార పదార్థాల ప్రదర్శనలతో అలరించారు. కరస్పాండెంట్ చుండూరి కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ చుండూరి వాణితో పాటు దాసు, అనంతోజు లక్ష్మీచంద్ర, కె.స్వాతి, గుంజిపల్లి జనార్దన్, టీచర్లు పాల్గొన్నారు.

### మహిళలు ఆర్థికంగా ఎదగాలి

**ముదిగొండ:** మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎంపీపీ సామినేని హరిప్రసాద్ సూచించారు. ముదిగొండలోని నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యాన మహిళలకు ఏర్పాటుచేసిన కుట్టుశిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. ఈసందర్భంగా మహిళలకు ఆయన సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. దిశ సభ్యురాలు చింతలచెర్వు లక్ష్మి, శిక్షణ కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

### మృతుల కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

**ఏన్కూరు/కారేపల్లి:** ఏన్కూరు మండలంలోని హిమామ్‌నగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన లకావత్ రవి కుటుంబాన్ని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ బుధవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా శివ, నాయకులు బానోతు సురేష్‌నాయక్, మేడ ధర్మారావు, భూక్యా లాలు, బాలాజీ, గుగులోతు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, కారేపల్లి మండలం వెంకిట్యాతండాకు చెందిన గుగులోతు భాస్కర్ ఇటీవల మృతి చెందగా, బుధవారం జరిగిన ఆయన సంస్మరణ సభలో ఎమ్మెల్యే రాములునాయక్ పాల్గొని నివాళులర్పించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పెద్దబోయిన ఉమాశంకర్, ఇస్లావత్ బన్సీలాల్‌తో పాటు రావూరి శ్రీనివాసరావు, బానోతు దేవ్లానాయక్, అడ్డగోడ ఐలయ్య, అజ్మీరా వీరన్న, పిల్లి వెంకటేశ్వర్లు, గోలి భాస్కర్, జామ్లా, రఘు పాల్గొన్నారు.

### బాలికల భద్రతపై అవగాహన

**ఎర్రుపాలెం:** మండల కేంద్రంలోని కేజీబీవీ జూనియర్ కళాశాలలో బుధవారం బాలికలు, మహిళల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల సూపరిండెంట్ కె.సరిత మాట్లాడుతూ ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాలను వినియోగించే క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు పంచుకోవడం ద్వారా మోసపోయే ప్రమాదముందని తెలిపారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

### కంటి పరీక్షలు చేయించుకోండి

**చింతకాని:** రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు శిబిరంలో ప్రతిఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలని ఎంపీపీ కోపూరి పూర్ణయ్య సూచించారు. మండలంలోని సీతంపేటలో కంటివెలుగు శిబిరాన్ని బుధవారం ఆయనప్రారంభించి మాట్లాడారు. ఉచితంగా పరీక్షలు చేయడమే కాక అవసరమైన వారికి అద్దాలు ఇస్తారని తెలిపారు. సర్పంచ్ నారపోగు కొండలరావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, వైద్యాధికారి వెంకటేశ్వర్లు, ఎంపీఓ మల్లెల రవీంద్రప్రసాద్‌తో పాటు నారపోగు యాకోబు, కృష్ణారావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# నమ్మాలి.. ఇది సర్కారు బడే!

- కార్పొరేట్‌కు దీటుగా భరణిపాడు పాఠశాల
- మన ఊరు – మన బడిలో సుందరీకరణ
- ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభానికి ముస్తాబు




రంగులతో ముస్తాబైన పాఠశాల భవనం (ఇన్‌సెట్) ప్లేట్లు శుభ్రం చేసుకుంటున్న విద్యార్థులు

**వేంసూరు:** గతంలో ప్రభుత్వ పాఠశాల అంటే అరకొర సౌకర్యాలు.. నేలపై చదువులు.. కూలిన ప్రహరీ, ఎప్పుడు కూలుతాయో తెలియని తరగతులు గదులు! కానీ ఇదంతా గతం. ఇప్పుడు రాష్ట్రప్రభుత్వం మన ఊరు - మన బడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తోంది. ఈక్రమంలో వేంసూరు మండలం భరణిపాడు పాఠశాలలో అభివృద్ధి పనులు, మరమ్మతులు, సౌకర్యాల కల్పనకు రూ.14లక్షలు మంజూరు చేయగా పనులు పూర్తయ్యాయి. దీంతో పాఠశాల భవనం, ఆవరణ ఇప్పుడు సర్వాంగ సుందరంగా ముస్తాబై ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది.

**పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య..**

గ్రామంలో చాలావరకు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్న వారే. కష్టపడి పనిచేసి పిల్లలకు మంచి చదువు అందించాలనే తపన వారిది. సర్కార్ బడిలోనే నాణ్యమైన విద్య అందుతుండడంతో పాఠశాలలో చేర్పించేందుకు ముందుకు వచ్చారు. భరణిపాడు పాఠశాలలో 1నుంచి 7వ తరగతి వరకు ఉండగా.. 62 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఆటపాటల రూపంలో బోధన చేస్తుండడమే కాక ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు ప్రధానోపాధ్యాయుడు రత్నంరాజు చెబుతున్నారు.

**ఇంటింటికి వెళ్లి వివరిస్తూ..**

బడి ఈడు పిల్లలను తప్పకుండా పంపిచాలని ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు హెచ్‌ఎంతో పాటు సర్పంచ్ సునీత వెంకట్‌రెడ్డి ఆధ్వర్యాన అవగాహన కల్పిస్తున్నారు. గ్రామంలోని బాలబాలికలందరూ పాఠశాలకు రావాలన్నదే తమ లక్ష్యమని చెబుతున్నారు. అవసరమైతే సొంత ఖర్చులతో వస్తువులను అందజేస్తామని చెబుతున్న వీరికి పలువురు సహకరిస్తుండడంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది.

**దాతల సాయంతో...**

మన ఊరు – మన బడిలో భాగంగా భరణిపాడు పాఠశాలకు రూ.14లక్షలు మంజూరు చేయగా.. భవనానికి రంగులు వేసి ముస్తాబు చేశారు. అలాగే, విద్యార్థుల సౌకర్యార్థం బెంచీలు, తాగునీటి కుళాయిలు, మురుగుదొడ్లు, విద్యుద్దీకరణ పనులు చేపట్టారు. అలాగే, పాఠశాల గోడలపై ఆసక్తి కలిగించే బొమ్మలు చేయడంతో పరిసరాలు అందంగా రూపుదిద్దుకున్నాయి. దీనికి తోడు గతంలోనే ఎన్ఆర్ఐలు, గ్రామస్తుల సహకారంతో పాఠశాలలో తాగునీటి ట్యాంక్, సరస్వతి విగ్రహం, ఆర్చీ ఏర్పాటు చేశారు. అలాగే, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటడంతో ఏపుగా పెరిగి పచ్చదనం వెల్లివిరుస్తోంది. కాగా, ఇక్కడి ప్రధానోపాధ్యాయుడు రత్నంరాజు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకోవడం విశేషం.

**అన్ని సౌకర్యాలు కల్పించారు..**


మా పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయి. తరగతి గదిలో రంగురంగుల బెంచీలు ఏర్పాటుచేశారు. తాగునీటికి ఇబ్బంది లేదు. బయట కూడా పచ్చని చెట్లతో చల్లగా ఉంటుంది. ఉపాధ్యాయులు మాకు ఆటపాటలతో పాఠాలు అర్థమయ్యేలా బోధిస్తున్నారు.

– విస్సంపల్లి శ్రీవల్లి, విద్యార్థి

**చాలా సంతోషంగా ఉంది..**


మన ఊరు – మన బడి ద్వారా ప్రభుత్వం రూ.14 లక్షలతో సౌకర్యాలు కల్పించడం సంతోషంగా ఉంది. పాఠశాల అభివృద్ధికి సర్పంచ్ మందపాటి సునీతా వెంకటరెడ్డి సహకారం అందిస్తున్నారు. ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించి బోధిస్తూ తీర్చిదిద్దుతున్నాం.

– కె.రత్నంరాజు, ప్రధానోపాధ్యాయులు

## లీకేజీ నిందితులను కఠినంగా శిక్షించాలి


దీక్షలో పాల్గొన్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

**సత్తుపల్లిరూరల్:** టీఎస్పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు దీక్ష చేపట్టారు. సత్తుపల్లిలో బుధవారం నిర్వహించిన దీక్షలో సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ మాట్లాడుతూ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటలాడడం దారుణమన్నారు. ఈమేరకే పకడ్బందీగా కేసు విచారించి నిందితులను కఠినంగా శిక్షించడమే కాక మరోమారు తప్పులు జరగకుండా చూడాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు దుస్సా వెంకటేశ్వర్లు, చిల్లపల్లి మాధవరావు, పామర్తి నాగేశ్వరరావు, గుడిదల రామకృష్ణ, తిన్నవల్లి రంగారావు, రాయల కోటేశ్వరరావు, బెజవాడ సాయి శేషు, వీరివాడ నాగభూషణం, కోట సత్యనారాయణ, కోమటి తిరుమలరావు, బజ్జూరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### 2న బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

**సత్తుపల్లి:** సత్తుపల్లి మండలం బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం వచ్చే నెల 2న నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు యాగంటి శ్రీనివాసరావు తెలిపారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ మొదటి విడతగా రేగళ్లపాడు, బుగ్గపాడు, రుద్రాక్షపల్లి, కాకర్లపల్లి, రామానగరం, గంగారం, బేతుపల్లి, రామగోవిందాపురం, పాకలగూడెం, తాళ్లమడ, నారాయణపురం గ్రామాల పార్టీ కార్యకర్తలతో సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. ఈమేరకు గంగారంలోని వాసు గార్డెన్స్‌లో ఉదయం 9 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశానికి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీలు నామా నాగేశ్వరరావు, బండి పార్థసారధిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు తాతా మధు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ కూసంపూడి రామారావు, నాయకులు దొడ్డా శంకర్‌రావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, పాల వెంకటరెడ్డి, మోదుగు పుల్లారావు పాల్గొన్నారు.

### వరిలో తెగుళ్ల పరిశీలన

**తల్లాడ:** తల్లాడలో రైతులు సాగు చేసిన వరి పైరును తెగుళ్లు ఆశించడంతో మండల వ్యవసాయాధికారి ఎం.డీ.తాజుద్దీన్ బుధవారం పరిశీలించారు. పూత దశ నుండి గింజ పాలు పోసుకొనే దశలో వరి ఉండగా, గింజలో నల్ల మచ్చ తెగులు, అగ్గి తెగులు, మెడ విరుపు తెగులు సోకినట్లు గుర్తించి నివారణ చర్యలను వివరించారు. ఏఈఓలు గురుమూర్తి, శివకుమార్, రైతులు పాల్గొన్నారు.

### హత్యాయత్నం గర్హనీయం

**తల్లాడ:** బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణపై బోనకల్‌లో హత్యాయత్నానికి పాల్పడడం గర్హనీయమని బీజేపీ తల్లాడ మండల అధ్యక్షులు ఆపతి వెంకటరామారావు పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు దాడులు చేయకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో రాజకీయాలు చేయాలని సూచించారు. నాయకులు గాదె కృష్ణారావు, యు.శ్రీనివాస్, జి.నరేష్ పాల్గొన్నారు.

## మాదిగలను పార్టీలన్నీ మోసం చేస్తున్నాయి..


మాట్లాడుతున్న ఏపూరి వెంకటేశ్వరరావు

**కల్లూరు:** అధికారంలోకి వస్తే వంద రోజులలో ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పిన బీజేపీ నేతలు కాలయాపనతో మోసం చేసిందని ఎంఎస్పీ జిల్లా కోఆర్డినేటర్ ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ ఆరోపించారు. ఎంఎస్పీ జిల్లా నాయకుడు దారెల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన చేపట్టిన మాదిగల సంగ్రామ పాదయాత్ర బుధవారం కల్లూరు మండలంలోని గోకవరం, బత్తులపల్లి, కప్పలబంధం మీదుగా కల్లూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఏపూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మాదిగలను ఎస్సీ వర్గీకరణ విషయంలో అన్ని పార్టీలు మోసం చేస్తున్నాయని విమర్శించారు. ఈ యాత్రలో నాయకులు కొలికపోగు వెంకటేశ్వరరావు, నల్లగట్ల కోటేశ్వరరావు, నల్లగట్ల వేణు, సురేష్, కొత్తపల్లి వెంకట్, కొండూరు కిరణ్‌కుమార్, బొక్కా వెంకటేశ్వరరావు, చాట్ల రంజిత్, పరిగడపు రాము, ఖమ్మంపాటి పుల్లారావు, జొన్నలగడ్డ నవీన్, రాయల సుందరం, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రైం కార్నర్

### సారా విక్రయిస్తున్న మహిళలపై కేసు

**కల్లూరు:** మండలంలోని ఎర్రబంజర, కొత్తబోడిమెల్లల్లో నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ బి.రాంప్రసాద్ తెలిపారు. ఎస్సై ఎం.వెంకటేష్, సిబ్బంది కె.నాగరాజు, కె.విల్సన్, సురేష్‌తో కలిసి బుధవారం తనిఖీలు చేపట్టగా ఎర్రబంజర్‌కు చెందిన బానోత్ జ్యోతి, కొత్తబోడిమెల్లకు చెందిన బానోత్ జ్యోతి నాటు సారా విక్రయిస్తుండగా పట్టుపడ్డారు. దీంతో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ తెలిపారు.

### రూ.లక్ష నగదు, ఆభరణాలు చోరీ

**కారేపల్లి:** గుర్తు తెలియని దుండగులు పట్టపగలే చోరీకి పాల్పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పేరుపల్లికి చెందిన సామినేని హన్మంతరావు, కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి బుధవారం ఉదయం చేను పనులకు వెళ్లారు. మధ్యాహ్నం వచ్చే సరికి ఇంటి తలుపు తాళం పగలకొట్టి ఉండటంతో పాటు బీరువాను సైతం పగులకొట్టి అందులో నుంచి రూ.లక్ష నగదు, రెండు తులాల బంగారం, ల్యాప్‌టాప్ చోరీ చేసినట్లుగా గుర్తించారు. ఈ విషయమై బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఏఎస్సై నాగరాజకుమారి తెలిపారు.

### కుక్కల దాడిలో వృద్ధురాలికి గాయాలు

**కారేపల్లి:** మండలంలోని విశ్వనాథపల్లిలో బుధవారం ఓ వృద్ధురాలిపై మూడు వీధికుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన చిప్పలపల్లి నామమ్మ పని నిమిత్తం ఇంటి ఎదుట రోడ్డుపైకి రాగా వీధికుక్కలు వెంట కాళ్లు, చేతులపై కరవడంతో గాయపడింది. దీంతో ఆమెకు కారేపల్లి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు.

# కల్యాణోత్సవానికి ముస్తాబు


సత్తుపల్లి టౌన్ : కల్యాణోత్సవానికి ముస్తాబైన సత్తుపల్లిలోని శ్రీకోదండ రామాలయం


పెనుబల్లి : స్వామివారికి సమర్పించేందుకు పట్టువస్త్రాలు తీసుకొచ్చిన భక్తులు

**సత్తుపల్లి టౌన్/పెనుబల్లి/కల్లూరు/ముదిగొండ:** శ్రీరామనవమి సందర్భంగా గురువారం శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం జరగనుంది. ఈ సందర్భంగా ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. పెనుబల్లిలోని కోదండ రామాలయంలో జరగనున్న వేడుకకు బేతుపల్లికి చెందిన పుచ్చకాయల రవి రూ.17 వేల విలువైన పట్టు వస్త్రాలు, ఉత్సవ విగ్రహాలకు ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆచంటి శ్రీనివాసరావు, మిట్టపల్లి సత్యనారాయణ – సునీత దంపతులు కూడా వస్త్రాలు సమర్పించారు. ఇక పెనుబల్లికి చెందిన దొంతుబోయిన నరసింహారావు మూడు వెండి తిరునామాలు, బొట్టును ఆలయ అర్చకులు శ్రీరంగం అర్చకులు వెంకటాచార్యులకు అందజేశారు. అలాగే, ముదిగొండ మండలం ముత్తారంలో ఎక్కడాలేని విధంగా శ్రీసీతారామచంద్రస్వామి వారి కల్యాణం సాయంసంధ్యా సమయాన జరగనుంది. ఇక సత్తుపల్లి మండలంలో గురువారం జరిగే శ్రీసీతారాముల కల్యాణమహోత్సవానికి ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాలను మామిడితోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించి చలువ పందిళ్లు వేశారు. అలాగే, కల్లూరు కప్పలబంధం రోడ్డులో తేరుబావి గుడి వద్ద శ్రీ దాసాంజనేయ స్వామివారి దేవాలయంలో కూడా రాములోరి పెళ్లికి ఏర్పాట్లు పూర్తయ్యాయి.

## ప్రభుత్వ పథకాలను వినియోగించుకోండి



చింతకాని : లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ కమలరాజ్

**చింతకాని/ముదిగొండ:** రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్ సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో జీఓ 58, 59 ద్వారా ప్రభుత్వం మంజూరైన 93మందికి ఇళ్ల పట్టాలను బుధవారం ఆయన అందజేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న నిరుపేద కుటుంబాలు 125 గజాల వరకు ఎటువంటి రుసుము చెల్లించకుండా క్రమబద్ధీకరించి పట్టాలు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే, సొంత స్థలం ఉన్న వారు ఇంటి నిర్మాణానికి రూ.3లక్షలను ప్రభుత్వం ఇవ్వనుందని పేర్కొన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు పర్చగాని తిరుపతి కిషోర్, ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, తహసీల్దార్ మంగీలాల్, సర్పంచ్‌లు బండి సుభద్ర, ఆలస్యం నాగమణి, చాట్ల సురేష్, నారపోగు కొండలరావు, రాసాల సాంబలక్ష్మితో పాటు పానుగోటి రత్నాకర్, మునుకుంట్ల నాగరత్నం, కంభం సరోజిని, నారపోగు యాకోబు, మార్గం కొరివీ రమ్య, ఉష, సత్యవతి తదితరులు పాల్గొన్నారు. ఇక ముదిగొండ మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో 22మందికి జెడ్పీ చైర్మన్ ఇళ్ల పట్టాలు అందజేశారు. తొలుత వెంకటాపురంలో ఇంటింటికీ బీఆర్ఎస్ పేరిట ప్రచార కార్యక్రమం చేపట్టారు. అలాగే, రూ.10లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఎంపీపీ సామినేని హరిప్రసాద్, జెడ్పీటీసీ పసుపులేటి దుర్గ, తహసీల్దార్ శిరీష, సర్పంచ్‌లు మందరపు లక్ష్మి, తుపాకుల రమాదేవి, అనంతరాములు, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మారెడ్డి, వెంకట్‌గౌడ్‌తో పాటు మీగడ శ్రీనివాస్‌యాదవ్, పసుపులేటి వెంకట్, బత్తుల వీరారెడ్డి, తుపాకుల యలగొండస్వామి, తోట ధర్మ పాల్గొన్నారు.

## ఘనంగా టీడీపీ ఆవిర్భావ వేడుకలు


సత్తుపల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు

**సత్తుపల్లిరూరల్:** తెలుగుదేశంపార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సత్తుపల్లి మండలం, పట్టణంలో ఆ పార్టీ నాయకులు బుధవారం జరుపుకున్నారు. స్థానిక మసీద్ రోడ్డులోని టీడీపీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించాక బైక్‌ర్యాలీ నిర్వహించారు. అలాగే, పట్టణంతో పాటు తాళ్లమడలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రేజర్లలో కూడా టీడీపీ జెండా ఆవిష్కరించారు. నాయకులు పోట్రు వెంకటరామారావు, పోట్రు సరస్వతి, వినుకొండ రమేష్, మల్లూరు మోహన్, దొడ్డా సత్యం, తిమ్మిరెడ్డి రాంబాబు, తుమ్మలపల్లి రాజేశ్వరరావు, గోసు కృష్ణారావు, గుత్తా వెంకటేశ్వరరావు, కనకపూడి నాగార్జున, తడికమళ్ల బాలకృష్ణ, వెంకటేష్, బూరుగు రవి తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు బస్‌పాస్‌ల పంపిణీ


ముదిగొండ : బస్‌పాస్‌లు జారీ చేస్తున్న సిబ్బంది

**ముదిగొండ/వైరారూరల్/తల్లాడ:** ముదిగొండ మండలంలోని కమలాపురంలో దివ్యాంగులకు బుధవారం ఆర్టీసీ బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిబిరంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొని 30మందికి పాస్‌లు జారీ చేశారు. సర్పంచ్ వల్లూరి వరలక్ష్మి, ఆర్టీసీ సిబ్బంది మెరుగు రవీంద్రనాథ్, భుజంగరావు పాల్గొన్నారు. అలాగే, వైరా మండలం రెబ్బవరంలో మధిర డిపో ఆధ్వర్యాన దివ్యాంగులు 18మందికి బస్‌పాస్‌లు జారీచేశారు. మధిర డిపో మేనేజర్ ఎస్.దేవదానం, సర్పంచ్ సాదం రామారావు, ఉపసర్పంచ్ గుత్తా కృష్ణ, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు. ఇక తల్లాడ మండలం గోపాలపేట గ్రామంలో దివ్యాంగులకు రాయితీ బస్‌పాస్‌లు అందజేశారు. తాళ్లూరి పుల్లయ్య జ్ఞాపకార్థం ఈ పాస్‌లు అందజేయగా సర్పంచ్ నల్లమోతు మోహన్‌రావుతో పాటు చల్లగుండ్ల కృష్ణయ్య, కూచిపూడి వెంకటయ్య, గోపాల్‌రావు, భూక్యా పద్మ, ఎస్.కే.నజీమా, కోన కృష్ణయ్య, తుళ్లూరు వెంకటయ్య పాల్గొన్నారు.

# పాఠశాలల్లో వార్షికోత్సవ సందడి

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బుధవారం వార్షికోత్సవం, పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాలు నిర్వహించారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి వార్షిక పరీక్షలు జరగనున్న నేపథ్యాన సమావేశాలు ఏర్పాటుచేయగా.. విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. అలాగే, ఉపాధ్యాయులు పరీక్షలకు సిద్ధం కావాల్సిన తీరుపై అవగాహన కల్పించి పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కాగా, విద్యార్థులు పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకోవడమే కాక పాఠశాలను వీడిపోతున్న బాధతో కన్నీటి పర్యంతమయ్యారు. – సాక్షి నెట్‌వర్క్


ఎరుప్రాలెం: ఉపాధ్యాయులతో మామునూరు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు


మధిర : మడుపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో చైర్‌పర్సన్ లతను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు


వైరారూరల్: గన్నవరం జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థినులకు జ్ఞాపికలు ఇస్తున్న ఉపాధ్యాయులు


ఏన్కూరు : నృత్యం చేస్తున్న జెడ్పీహెచ్‌ఎస్ బాలికలు


కొణిజర్ల : విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న పరిశ పుల్లయ్య


సత్తుపల్లి టౌన్ : సదాశివునిపేట హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులతో సర్పంచ్ సరస్వతి


వైరా : ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మాట్లాడుతున్న హెచ్‌ఎం శాంతకుమారి